క్లుప్తంగా

నేడు గణపతి నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం



శ్రీ పూజ గణపతి కుమారస్వామి ఆలయం

నిడదవోలు: స్థానిక గణేష్‌చౌక్ సెంటర్లోని శ్రీ పూజ గణపతి కుమారస్వామి వార్ల ఆలయం వద్ద నిర్వహించే గణపతి నవరాత్ర మహోత్స వాలకు శనివారం ఉదయం 8.32 గంటలకు రాట ముహూర్తం చేస్తారని ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు శుక్రవారం తెలిపారు. పురాతనమైన ఈ ఆలయంలో 104 ఏళ్లుగా క్రమం తప్పకుండా గణపతి నవరాత్ర మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. రాట ముహూర్తానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, నిడదవోలు సీఐ వి. శ్రీనివాసరావు హాజరు కానున్నారు.

ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా సహకరించండి

కొవ్వూరు: సెప్టెంబర్ 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేందుకు న్యాయవా దులు సహకరించాలని జిల్లా తొమ్మిదో ఇన్‌చార్జ్ అదనపు జడ్జి డి.సత్యవతి కోరారు. స్థానిక కోర్టు హాలులో శుక్రవారం నిర్వహించిన న్యాయవాదుల సమావేశంలో ఆమె మాట్లా డారు. అదాలత్‌లో రాజీ పడదని అన్ని కేసు లనూ పరిష్కరించుకోవచ్చన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతి రావు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు శుక్ర వారం స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావుకు వినతి పత్రం అందజేశారు. షిఫ్టుల వారీగా కాకుండా ఇంటర్, డిగ్రీ తరగతులను రెండు పూటలా నిర్వహించాలని కోరారు. పీడీ ఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మహర్షి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కాశీనాని, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.వినోద్, ఎం.క్రాంతి పాల్గొన్నారు.

జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీలేఖకు ప్రశంసా పత్రం



గుజరాత్‌లోని ఆనంద్‌లో శిక్షణ సర్టిఫికెట్ అందుకుంటున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీలేఖ

తాళ్లపూడి: గుజరాత్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్ (ఐఆర్ఎంఏ)లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి రెసిడెన్షియల్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు తాళ్లపూడికి చెందిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ హాజరైన విషయం తెలిసిందే. ఇక్కడ శిక్షణ పొందిన పోసిన శ్రీలేఖ కేంద్ర మంత్రి, ప్రొఫెసర్ల చేతుల మీదుగా ప్రసంసాపత్రం అందుకు న్నారు. శుక్రవారం నాటి శిక్షణకు హాజరైన కేం ద్ర పంచాయతీ రాజ్, ఫిషరీస్‌శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌ను ఆమె కలుసుకున్నారు.

గుబ్బాలమ్మకు సౌభాగ్యలక్ష్మి గాజులార్చన

నిడదవోలు రూరల్: శ్రావణ మాసాన్ని పురస్క రించుకుని మండలంలోని గోపవరం గ్రామంలో వేంచేసిన గుబ్బాలమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సౌభాగ్యలక్ష్మి గాజులార్చన, గౌరీ పూజ, వరలక్ష్మీ వ్రతం, ప్రసాద వితరణ నిర్వహించినటట్టు ఆలయ ఈఓ మేనేజర్ నామా సూర్యప్రకాష్ చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించు కుని, మొక్కులు చెల్లించుకున్నారు.

రూ.150 పెట్రోల్ అర కిలోమీటరూ రాలేదు?

బంకు వద్ద ఆందోళన



పెట్రోల్ బంకు ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజలు

నల్లజర్ల: స్థానిక బస్టాండ్ పక్కనే ఉన్న ఇండి యన్ ఆయిల్ బంక్‌లో తన మోటార్ సైకిల్‌లో రూ.150తో పెట్రోలు కొట్టిస్తే కనీసం అర కిలో మీటరు దూరం కూడా రాలేదంటూ కవులూ రుకు చెందిన కుందుల లోకేష్ అనే వ్యక్తి ఆ బం కు ఎదుట శుక్రవారం రాత్రి ఆందోళనకు దిగాడు. దీనిపై పంపు బోయ్‌ను ప్రశ్నించగా తమ ఓనర్ వచ్చాక మాట్లాడతారని బైక్ పక్కన పెట్టమన్నాడు. దీంతో లోకేష్ తన బంధువులకు ఫోన్ చేయగా దాదాపు 100 మందికి పైగా వచ్చి ఆందోళనకు దిగారు. వారికి స్థానికులు మద్ద తుగా నిలిచారు. బంక్‌లో జరుగుతున్న మోసా లను బయట పెడతామని, సీసీ కెమెరాలు ఓ పెన్ చేయాలంటూ కేకలు వేశారు. దీంతో పోలీ సులు రంగ ప్రవేశం చేశారు. డిప్యూటీ తహసీ ల్దారు కిశోర్‌కుమార్ అక్కడకు వచ్చి విచారణ జరిపారు. శనివారం దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని చెప్పారు.



రాత్రి పూట ఇతరులను అనుమతించరాదు

రాత్రి పూట ఆసుపత్రుల్లోకి రోగులకు చెందిన ఇతర వ్యక్తులు ఎవరినీ అనుమ తించ కూడదు. ఇన్ పేషెంట్లు ఉండే గదుల్లోకి రోగి సహాయకులుగా వచ్చే వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. మహిళా వైద్యులు, సిబ్బంది రాత్రి పూట విశ్రాంతి తీసుకోవడానికి, దుస్తులు మార్చుకోవడానికి ఆసుపత్రుల్లో ప్రత్యేక గదులు ఉండాలి. నర్సులు, మహిళా వైద్యులకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ఇందుకోసం ప్రత్యేక చట్టాలు రూపొందించాలి

– టి.సుష్మ, వైద్యాధికారి, అర్బన్ హెల్త్ సెంటర్, కొవ్వూరు





నిర్భయంగా విధులు నిర్వర్తించాలి

ఆసుపత్రుల్లో మహిళా వైద్యులు, మహిళా సిబ్బంది నిర్భయంగా విధులు నిర్వ ర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. కోల్‌కతాలో పీజీ మహిళా వైద్యురా లిపై జరిగిన హత్యాచార ఉదంతం మానవ సమాజానికి మచ్చ లాంటిది. ఈ ఘటన తర్వాత వైద్యుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పీహెచ్‌సీలలో రాత్రివేళ స్టాఫ్ నర్స్ ఒక్కరే విధులు నిర్వర్తిస్తుంటారు. ఊరికి దూరంగా ఉండే పీహెచ్‌సీల్లో భద్రత అంతంత మాత్రమే. ఆసుపత్రులకు పోలీసు భద్రత కల్పించాలి.

– డాక్టరు గంగాధరరావు,వైద్యాధికారి , నల్లజర్ల పీహెచ్‌సీ

రహదారులా.. చెరువులా?

- వర్షాలకు ఛిద్రమైన రహదారులు
- నరకంగా మారిన ప్రయాణాలు
- మూడేళ్లలో 355 ప్రమాదాల నమోదు
- కనీస మరమ్మతులు చేపట్టని ప్రభుత్వం



పెరవలిలో ఆర్ అండ్ బి రోడ్డు దుస్థితి ఇలా..

పెరవలి: భారీ వర్షాలకు ఛిద్రమైన రోడ్లపై రాక పోకలు సాగించేందుకు వాహన చోదకులు, ప్రయా ణికులు హడలిపోతున్నారు. ‘‘అడుగుకో గొయ్యి.. గజానికో గుంత ’ అన్న చందంగా రోడ్లు దారుణం గా తయారయ్యాయి. వాటిపై ప్రయాణించేందుకు వాహనచోదకులు నానా అగచాట్లు పడుతున్నారు. కొత్తగా వచ్చే వాహనదారులు రోడ్డు బాగుందనే ఉద్దేశంతో వేగంగా వచ్చి గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గోతులు మరింత పెద్దవై మడుగుల్లా మారాయి. ముఖ్యంగా నిడదవోలు–నరసాపురం, నల్లాకులవా రిపాలెం –ఎర్ర వంతెన, కానూరు–నడుపల్లి కోట, కానూరు–కానూరు అగ్రహారం, కొత్తపల్లి అగ్రహారం రోడ్డు, ఖండవల్లి– కోడవల్లి ఆర్ అండ్ బీ రహదా రుల ఇందుకు నిదర్శనాలు. ఈ రహదారులపై ఏర్ప డిన గోతుల వలన నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉంది. వర్షాలకు రోడ్డుపై కంకర, రాళ్లు ఒకచోట పేరుకుపోతున్నాయి. వేగంగా వచ్చే వాహ నాల టైర్లు స్లిప్ అయి జారిపోయి ప్రమాదాలు సం భవిస్తున్నాయి. ఒక్కోసారి మోటార్ సైకిలిస్టులు రోడ్లపై ఏర్పడిన భారీ గోతుల్లో పడి గాయాల పాల వుతున్నారు. నిడదవోలు నరసాపురం ఆర్ అండ్ బీ రహదారి తీపర్రు నుంచి కానూరు వరకూ సుమారు 6 కిలోమీటర్ల మేర గోతులతో అధ్వనంగా మారింది. ఈ ప్రాంతంతో రోడ్డు ప్రమాదం సంభవించని రోజు లేదంటే ఆశ్చర్యం కలిగించే విషయం. అలాగే నల్లా కులవారిపాలెం–ఎర్ర వంతెన రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులతో ఈ మ్గాంలో ప్రయాణించే వాహ నచోదకులు నిత్యం నరకం చూస్తున్నారు. ఏడాది కాలంగా ఈ రోడ్డుపై సంభవించిన ప్రమాదాల్లో కాళ్లు, చేతులు విరిగి క్షతగాత్రులైన వారు ఎందరో ఉన్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆ గ్రామస్తులు మొరపెట్టుకుంటున్నారు.

ఆర్ అండ్ బీ రహదారులు..

పెరవలి మండలంలో ఆర్ అండ్ బి రహదారులు 40 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. వాటిలో 20 కిలోమీటర్ల మేర రోడ్లు గోతులు పడి అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా నిత్యం రద్దీగా ఉండే నిడదవోలు– నరసాపురం ఆర్ అండ్ బీ రహదారి పరిస్థితి దారుణంగా ఉంది. ఆర్ అండ్ బీ శాఖ అధి కారులు ఈ రోడ్డుపై ప్రయాణిస్తే గాని తమ ప్రయాణ కష్టాలు ఏమిటో అర్థం కావని ఈ ప్రాంత వాసులు పేర్కొంటున్నారు.

ప్రమాదాలకు నిలయాలు

గత మూడేళ్లలో పెరవలి మండలంలో 355 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఈ ప్రమాదాల్లో 225 మంది క్షతగాత్రులవగా 97 మంది మృతి చెందారు. ఇవన్నీ అధికారికంగా రికార్డుల్లో నమోదైనవి. రికా ర్డుల్లో నమోదు కాని రోడ్డు ప్రమాదాలు మరెన్నో ఉన్నాయి. ఈ ప్రమాదాలకు ముఖ్య కారణం రోడ్లు సక్రమంగా లేకపోవడమే అంటున్నారు.

కనీసం గోతులు పూడ్చలేదు



గత ప్రభుత్వం రోడ్లు వేయలేదని అప్పట్లో జనసేన నాయకులు గగ్గోలు పెట్టారు. వారు భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన తరువాత కనీసం రోడ్లపై ఏర్పడిన గోతులు కూడా పూడ్చలేదు. ఇప్పుడు ఆ గోతులే నూతుల్లా తయారయ్యాయి.

–అరిగెల వెంకటేశ్వరరావు, ముక్కామల

నిత్యం ప్రమాదాలు



రోడ్లపై పడిన గోతుల్లో పడి నిత్యం ఎందరో వాహనచోదకులు గాయాల పాలవుతు న్నారు. రోగులను ఆసు పత్రులకు తీసుకెళ్లాలన్నా ప్రాణాలు అరిచే తిలో పెట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం మారినా రోడ్ల పరిస్థితి మారలేదు.

– మెట్టే సత్యనారాయణ, లంకమాలపల్లి

గతంలో కంటే అధ్వానం



గతంలో కంటే రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి, గతం లో కనీసం గోతులైనా పూడ్చారు. ఇప్పుడు అదీ లేదు. నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నాం.

– కాలదాసి శ్రీను, ముక్కామల

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: యర్నగూడెంలోని 132 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫ రాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి. వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని యర్నగూడెం, కృష్ణంపాలెం, త్యాజం పూడి, చిన్నాయగూడెం, యాదవోలు గ్రామాల్లోని 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్లకు శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గం

నిడదవోలు: ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూని యన్ నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని షాదీఖా నాలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నిడదవోలు నూతన అధ్యక్షుడిగా తాడిమల్ల శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఎండీ మొహియుద్దీన్, కోశాధికారిగా ఎస్ఎస్ బాబు, సంయుక్త కార్యదర్శిగా పీఎస్ మన్యం, పబ్లిసిటీ కార్యదర్శిగా నారాయణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. దామోదర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికులకు చెల్లించా ల్సిన పాత బకాయిలను చెల్లించాలని కోరారు. ఆర్టీ సీలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయా లన్నారు.ఆర్టీసీ కార్మికులకు వైద్య సదుపాయాలను మరింతగా పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు

సమస్యలతో దద్దరిల్లిన గ్రామసభలు

- పారిశుధ్య నిర్వహణపై ప్రజల అసంతృప్తి
- రహదారుల నిర్మాణానికి తీర్మానాలు
- టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య వాగ్వాదం
- గోశాలల నిర్మాణంపై అధికారులను నిలదీసిన రైతులు



దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామసభలో సమస్యలను అధికారులకు వివరిస్తున్న రైతులు

దేవరపల్లి: సమస్యలతో గ్రామసభలు దద్దరిల్లాయి. భారీగా తరలి వచ్చిన జనం సమస్యలపై అధి కారులు, ప్రజాప్రతినిధులను నిలదీశారు. ప్రధానం గా గ్రామాల్లో అధ్వానంగా మారిన పారిశుధ్య నిర్వ హణ, రోడ్లు, డ్రైన్లు, సత్య సాయిబాబా మంచినీటి సరఫరా, విద్యుత్, ఇళ్లస్థలాల సమస్యలను వారు సభల్లో ప్రస్తావించారు. మండలంలోని గ్రామ సచి వాలయాల వద్ద శుక్రవారం సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. సభలను తహసీల్దార్ కె.రా జ్యలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎం పీడీఓ పి.ప్రభాకరరావు, ఎంఈఓలు ఎం. తిరుమ లదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు పర్యవేక్షించారు. గౌరీపట్నంలో సర్పంచ్ రాయి అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన సభలో గ్రామస్తులు పారిశుధ్యం, రోడ్లు, సత్యసాయిబాబా మంచినీటి సరఫరాలో సమస్య లను ప్రస్తావించారు. 2018లో గోశాలల నిర్మాణా నికి 10 మంది రైతుల నుంచి వారి వాటాగా రూ.లక్ష మొత్తాన్ని ప్రభుత్వం కట్టించుకుని రైతులు తెలి పారు. కేవలం ముగ్గురికి గోశాలలు మంజూరు చేశా రని, మిగిలిన ఏడుగురికీ ఇంత వరకూ డిపాజిట్ సొమ్ము కూడా చెల్లించలేదని రైతులు తెలిపారు. గ్రామంలోని పలువురి భూములను ఈనాం భూములుగా రికార్డుల్లో చూపడం వల్ల అడంగల్స్, 1– బి రికార్డు రావడం లేదని రైతులు రెవెన్యూ అధి కారులకు నివేదించారు. ఇలాంటి ఖాతాలు 93 ఉన్నాయని, ఆన్‌లైన్లో సరి చేసి సమస్యను పరిష్క రించాలని వారు కోరారు. కొవ్వాడ కాలువ పూడిక తీసి అభివృద్ధి చేయాలని రైతులు కోరారు. గ్రామం లో అభివృద్ధి పనులకు రూ.16 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభు త్వానికి పంపించినట్టు గౌరీపట్నం సర్పంచ్ రాయి అన్నపూర్ణ, ఉప సర్పంచ్ ఆండ్రు రమేష్‌బాబు తెలి పారు. దేవరపల్లి సభలో విద్యుత్, పారిశుధ్య నిర్వ హణ, వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్ల చోరీ, ఇళ్ల స్థలాల సమస్యలను ప్రజలు వివరించారు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల పంపిణీలో వివక్షత చూపారని టీడీపీ నాయకులు ఆరోపించారు. దాం తో వేదికపై ఉన్న వైఎస్సార్ సీపీ నాయకుడు పచ్చా రాంగోపాల్ ఖండించడంతో తీవ్ర వాగ్వాదం జరి గింది. గ్రామంలో రూ.2.69 కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి సభలో తీర్మానం చేసినట్టు సర్పంచ్ కడిమి వీరకుమారి తెలిపారు. యర్న గూడెం గ్రామసభలో పారిశుద్యం, రోడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి వంటి పలు సమస్యపై చర్చ జరి గింది. రూ.40 లక్షల వ్యయంతో ఐదు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి తీర్మానం చేసి ప్రతిపాదనలు పం పినట్టు సర్పంచ్ బొంతా భరత్‌బాబు తెలిపారు.

కోటసత్తెమ్మకు శ్రావణ శుక్రవారం పూజలు



కోటసత్తెమ్మ వారికి సారె తీసుకు వచ్చిన ధారవరం మహిళలు



విశేష అలంకరణలో పాలంగి కనకదుర్గమ్మ

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయంలో శ్రావణ మాసంలోని శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాగల్లు మం డలం దారవరం గ్రామానికి చెందిన 30 మంది మహిళలు అమ్మవారికి సారె తీసుకువచ్చారు. ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవా రిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ , ప్రధానా ర్చకుడు అప్పారావుశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని పాలంగి, ఉండ్రాజవరం, మోర్త గ్రామాల్లోని కనకదుర్గమ్మ వార్లను అధిక సం ఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు, వ్రతాలు నిర్వహించారు. పాలంగిలోని కనకదుర్గమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తాడిపర్రు గోగులమ్మ అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

రైతు సేవా కేంద్రాల్లో ఇసుక బుక్ చేసుకోవాలి



పందలపర్రు ఇసుక ర్యాంపు వద్ద వాహన డ్రైవర్లతో మాట్లాడుతున్న కొవ్వూరు ఇన్‌చార్జ్ ఆర్డీవో కృష్ణనాయక్

కొవ్వూరు ఇన్‌చార్జ్ ఆర్డీవో కృష్ణనాయక్

నిడదవోలు రూరల్: మండలంలోని పెండ్యాల, పం దలపర్రు స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక కోసం విని యోగదారులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో బుకిం గ్ చేసుకోవాలని కొవ్వూరు ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఆర్.కృ ష్ణనాయక్ తెలిపారు. పందలపర్రు ఇసుక స్టాక్ పాయింట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించి వాహన డ్రైవర్లతో రవాణా చార్జీలపై మాట్లాడారు. ఈ సందర్భంగా కృష్ణనాయక్ మాట్లాడుతూ ఇసుక బుక్ చేసుకున్న 24 గంటల తర్వాత మాత్రమే స్లాట్ ఇస్తామన్నారు. ఆధార్ కార్డు, ఇసుక ఎందుకు అవ సరం, వాహన వివరాలతో వినియోగదారులంతా బుకింగ్ చేసుకోవాలన్నారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ నిర్ణయించిన టన్ను రూ.270లు యూపీఐ విధానం ద్వారా ఇసుకకు పేమెంట్ చెల్లించాలని చెప్పారు. రవాణ శాఖ రిజిస్ట్రేషన్ చేసిన వాహనా లకు మాత్రమే ఇసుక బుకింగ్‌కు అనుమతిస్తామ న్నారు. బుక్ చేసిన వినియోగదారునికి కాకుండా వేరే ప్రదేశానికి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యేంద్ర, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే..

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- గ్రామ సభల్లో సమస్యలపై వెల్లువెత్తిన జనం



దొమ్మేరు గ్రామసభలో మాట్లాడుతున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: గ్రామాల్లోని డ్రైన్లు, రోడ్లు, శ్మశానవాటికలు, తాగునీరు, డంపింగ్ యార్డు, మరుగుదొడ్లు వంటి సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. దొమ్మేరులో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రతి సమస్యనూ రాతపూర్వకంగా తెలియజేస్తే ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామంలోని డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. అంతకు ముందు గ్రామంలో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టే రెండు డ్రైన్లు, ఒక రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ముప్పిడి శంకుస్థాపనం చేశారు.ఎంపీపీ కాకర్ల నారాయుడు, సర్పంచ్ తానేటి కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, ఎంపీడీవో కె.సుశీల, ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు యలమర్తి రాం బాబు, నాయకులు కేవీకే రంగారావు జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గారపాటి శ్రీదేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

నల్లజర్ల: వచ్చే ఐదేళ్లలో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శుక్రవారం దూబచర్లలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఉద్యాన సాగులో ఉపాధిహామీ పథ కాన్ని అనుసంధానం చేయాలని, గ్రామంలో బోర్లు, గ్రావెల్ రోడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మె ల్యేను కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, సర్పంచ్ తాడి గడప బాలయ్య, ఉప సర్పంచ్ కాసాని బాటయ్య పాల్గొన్నారు. అలాగే నల్లజర్లలో సర్పంచ్ పల్లి జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో 92 కొత్త ఉపాధి పనులకు ప్రతిపాదించారు. కూలీలకు 35 వేల పనిదినాలు కల్పించనున్నట్టు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్ తెలిపారు. తహసీల్దార్ కృష్ణారావు, మాజీ సర్పంచ్ యలమాటి శ్రీనివాస్, కండెపు వెంకటరత్నం పాల్గొన్నారు.

రూ.342 కోట్లతో132 ఉపాధి పనులకు ప్రతిపాదనలు

గోపాలపురం: ఉపాధి హామీ పథకం కింద మండలం లోని 18 పంచాయతీల పరిధిలో 132 పనులకు రూ.342 కోట్లతో ప్రతిపాదనలు వచ్చినట్టు ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి చెప్పారు. శుక్రవారం గోపాలపురం మం డలంలోని 18 పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహించారు. 18 పంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, కాలువ పూడికతీత వంటి పనులను గుర్తించినట్టు ఎంపీడీఓ తెలిపారు. సుమారు 9 వారాలుగా తమకు వేతనాలు అంద లేదని ఉపాధి కూలీలు గ్రామసభ దృష్టికి తీసుకు వచ్చారు. గోపాలపురం గ్రామసభలో పంచాయతీ పాలక వర్గానికి సమాచారం ఇవ్వలేదంటూ వార్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

చాగల్లు: మండలంలోని 13 పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లోనూ వివిధ సమస్యలు చర్చకు వచ్చాయి. చాగల్లు, మల్లవరం గ్రామసభల్లో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొ న్నారు. రోడ్లు, డ్రైనేజీలు, పైప్‌లైన్లు, మంచినీటి సర ఫరా, వీధిలైట్లు వంటి సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ఆయనకు అర్జీలు సమర్పించారు. ఆళ్ల హరి బాబు, నాదెళ్ల నాని, సర్పంచులు, తహసీల్దార్ మెరికమ్మ, ఇంచార్జ్ ఎంపీడీఓ పి.నిర్మలకుమారి, మం డల విస్తరణాధికారి ఆర్. శ్రవణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వై.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి, అన్నదేవరపేట గ్రామసభల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పెద్దేవం సభలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు పాల్గొన్నారు. మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో కూలీలకు 2,460 ఉపాధి పని దినాలను గుర్తించామని ఎంపీడీ వో వెంకటరమణ తెలిపారు. మండలంలో గుర్తిం చిన 19 ఉపాధి పనులకు రూ.8.83 లక్షలు ప్రతిపా దించామని చెప్పారు.

నిడదవోలులో విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ



ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

నిడదవోలు: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని నిడదవోలు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి కోరారు. కోల్‌కతా ఘటనకు నిరసనగా ఈ కళాశాల అధ్యాపకులు విద్యార్థినీవిద్యార్థులు శుక్ర వారం కొవ్వొత్తుల ప్రదర్శనతో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. జూనియర్ వైద్యురాలి హత్యను తీవ్రంగా ఖండించాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది కూడా పాల్గొన్నారు.

పాముకాటుతో వృద్ధుడి మృతి

నిడదవోలు రూరల్: పాముకాటుకు గురైన వృ ద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్టు సమి శ్రగూడెం ఎస్సై రమేష్ తెలిపారు. మండలం లోని కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన వాసం శెట్టి రామకృష్ణ (61) అనే వృద్ధుడు ఈనెల 15న ఇంటి పక్కనే పశువుల పాకలో గేదెలకు గడ్డి వేసేందుకు వెళ్లగా పాముకాటుకు గురయ్యాడు. దీంతో రామకృష్ణను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా చికిత్స పొం దుతూ శుక్రవారం మృతి చెందాడు. దీనిపై మృ తుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ పేర్కొన్నారు.

మోటార్ సైకిల్ చోరీపై కేసు

కొవ్వూరు: మండలం లోని మద్దూరు గ్రామా నికి చెందిన ఖండవల్లి వెంకట పురుషోత్తమా చార్యులుకు చెందిన మోటార్ సైకిల్ చోరీకి గురైంది. పుజారిగా పని చేస్తున్న ఆయన గుడి ప్రాంగణంలోని రథం షెడ్‌లో ఉంచిన మోటార్ సైకిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఈనెల 19వ తేదీ రాత్రి అపహరించుకుని పోయారు. బాధితుడు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీని వాసరావు తెలిపారు.